
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 8, జనవరి, 2025



సోమశిలలో 71.489 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 71.489 టీఎంసీల నీరుంది. పైతట్టు ప్రాంతాల నుంచి 2630 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.79,420
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,215
3శాతం జీఎస్టీతో	రూ.7,423
నవర (8గ్రా)	రూ.59,448

గరిష్టం/కనిష్టం
30.8 /22.8

వాతావరణం

బుధవారం జిల్లాలో వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 71 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వరికి బీమా ప్రీమియాన్ని చెల్లించాలి

నెల్లూరు(సెంట్రల్): వరి పైరుకు బీమా ప్రీమియం చెల్లింపునకు ఈ నెల 15వ తేదీ చివరి గడువుగా నిర్ణయించినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరికి హెక్టార్‌కు రూ.420 చెల్లించి బీమా నమోదు చేసుకోవాలని సూచించారు.

జీపీగా శ్రీహరినారాయణరావు



శ్రీహరినారాయణరావు

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది చుండూరి శ్రీహరినారాయణరావును గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ) గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన జిల్లా కోర్టులో ప్రభుత్వానికి సంబంధించిన సివిల్ కేసులను వాదిస్తారు. మూడేళ్ల పాటు ఈయన పదవిలో కొనసాగుతారు. 30 సంవత్సరాల నుంచి న్యాయవాద వృత్తిలో ఉన్నారు. ఈయన నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

10న హాకీ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ బాలబాలికల మహిళా హాకీ జిల్లా జట్లను ఈ నెల 10వ తేదీన ఎంపిక చేయనున్నామని అసోసియేషన్ కార్యదర్శి జగన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఎంపికలకు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు వివిధ జిల్లాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు. వివరాలకు 94404 66189 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

టీజీపీ ప్రత్యేక కలెక్టర్‌గా శీనానాయక్

నెల్లూరు(అర్బన్): ఆత్మకూరులో తెలుగుగంగ భూసేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న కె.శీనానాయక్‌ను ప్రభుత్వం మంగళవారం తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా శీనానాయక్ నెల్లూరులోని టీజీపీ స్పెషల్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుత తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటరెడ్డిని ఆత్మకూరు భూసేకరణ విభాగానికి డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు.

పరిమితికి మించి పొగాకు సాగు వద్దు

- వేలం నిర్వహణాధికారి రాజశేఖర్

మర్రిపాడు: డీసీపల్లి వేలం కేంద్రంలో పరిధిలో ఇచ్చిన పరిమితి కన్నా ఎక్కువ పొగాకు పంటను రైతులు వేసి ఉన్నారని, దీని వల్ల నష్టపోయే ప్రమాదం అధికంగా ఉందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా పొగాకు పంటలో లాభాలు రావడంతో ప్రపంచమంతా సాగు అధికమైందన్నారు. మన రాష్ట్రంలోనూ పంటను ఇప్పటికే చాలా అధికంగా వేశారని డిమాండ్ కన్నా అధికంగా పండించడం వల్ల ఆశించిన ధరలు ఉండకపోవచ్చునన్నారు. ఇకనైనా పొగాకు నాట్లను వేయకుంటే మంచిదని పేర్కొన్నారు.



రీచ్ వద్ద నిలిపి ఉన్న ఇసుక తరలిస్తున్న వాహనాలు



తవ్వేద్దాం... అమ్మేద్దాం!

మంత్రి ఆనం ఇలాకాలో అడ్డగోలుగా ఇసుక దందా

- పీకేపాడు ఇసుక రీచ్‌ను పిండేస్తున్న మాఫియా
- అనుమతి లేకపోయినా యంత్రాలతో తవ్వకాలు
- రోజూ వందల వాహనాలతో అక్రమ రవాణా
- ఇతర జిల్లాలతోపాటు కర్ణాటక, తమిళనాడులకు తరలింపు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఇసుక వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపిన గ్రామస్తులు

జిల్లాలోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇలాకాలో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. అనుమతి లేకుండా భారీ యంత్రాలతో తోడేస్తోంది. రేయింబవళ్లు వందల వాహనాల్లో అక్రమంగా ఇసుకను ఇతర జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాలకు సైతం తరలిస్తోంది. ఈ అక్రమ ఇసుక దందా గురించి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఇటీవల గ్రామస్తులే రోడ్డెక్కి లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు.



రీచ్ వద్ద వాహనాలను అడ్డుకుని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు (పీకేపాడు) వద్ద పెన్నానదిలో ఇసుక రీచ్‌కు పర్యావరణ అనుమతి లేదు. అందువల్ల అక్కడ ఇసుక తవ్వకాలకు కలెక్టర్, మైనింగ్‌శాఖ అధికారులు అనుమతి ఇవ్వలేదు. కానీ, స్థానిక ప్రజాప్రతినిధి ఆదేశాల మేరకు సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన ఓ ఇసుక డాన్ ఈ రీచ్‌లో యంత్రాలను ఉపయోగించి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నాడు. ఇప్పటికే నదీ గర్భంలో 20 అడుగుల మేర తవ్వేశారు. ఇందుకోసం స్థానిక ప్రజాప్రతినిధికి రోజువారీ కప్పం కట్టేలా ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. పీకేపాడు రీచ్ నుంచి రోజూ 150 భారీ వాహనాలతోపాటు ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారు. ఏడు యూనిట్ల టిప్పర్‌కు రూ.10 వేలు, అంతకు మించి పెద్ద లారీలు, టిప్పర్లు అయితే రూ.15వేల నుంచి రూ.25వేల వరకు లోడింగ్ చార్జీల పేరిట వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్లకు అయితే యూనిట్ ఇసుకను రూ.వెయ్యి చొప్పున విక్రయిస్తున్నారు. ఈ దందా సాగిస్తున్న వ్యక్తి 20కి పైగా తన సొంత వాహనాలతో వైఎస్సార్, ప్రకాశం, గుంటూరు జిల్లాలతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సైతం ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాడు. అది కాకుండా ఇతర వాహనాల నుంచి లోడింగ్ చార్జీలు భారీగానే వసూలు చేస్తున్నారు. ఇక్కడ ఇసుక మాఫియా నెలకు సగటున రూ.50 కోట్ల వరకు ఆర్జిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



అధికారులకు నెలవారీ మామూళ్లు!

ఇసుక మాఫియాకు స్థానిక ప్రజాప్రతినిధి అండదండలు ఉండటంతో మైనింగ్, రెవెన్యూ, పోలీసు, రవాణా శాఖల అధికారులు నెలవారీ మామూళ్లు తీసుకుని ఇటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు వెళ్లే వాహన యజమానులు మాత్రం వాహనానికి రూ.12 వేలు చొప్పున పోలీస్ స్టేషన్లకు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పీకేపాడు ఇసుక రీచ్ నుంచి భారీ వాహనాలు ఇసుక తరలిస్తుండటంతో ఉప్పలపాడు సమీపంలో జాతీయ రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, పర్యావరణం దెబ్బతింటుందని, రోడ్లు ధ్వంసమవుతున్నాయని పడమటి కంభంపాడు గ్రామస్తులు ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఇటీవల గ్రామస్తులే రీచ్ వద్దకు వెళ్లి ఇసుక వాహనాలను అడ్డుకున్నారు. అయితే, అధికారులు వచ్చి ఇసుకాసురులకు కొమ్ము కాశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

కోడిపందేలు నిర్వహిస్తే కేసులే..



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: సంక్రాంతి పండగ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా కోడిపందేలు నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో జంతు హింస నివారణ చట్టం అమలుపై ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి పండగకు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించడం నేరమన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో పశుసంవర్థక శాఖ జేడీ రమేష్ నాయక్, ఏఎస్పీ సౌజన్య, డీఎఫ్ఓ మహబూబ్‌బాషా, జెడ్పీ సీఈఓ విద్యారమ, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, ఏడి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



పరుగులో పోటీపడుతున్న అభ్యర్థులు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు పోలీసు కవాతు మైదానంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. 600 మంది అభ్యర్థులకు గానూ 462 మంది హాజరయ్యారు. వారిలో 387 మంది పరీక్షల్లో పాల్గొనగా, మిగిలిన వారు వివిధ కారణాలతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేహదారుఢ్య పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టామని చెప్పారు.

మంత్రి నారాయణకు భయపడేది లేదు

- పొలిటికల్‌గా దేనినైనా ఎదుర్కొంటా
- కార్యకర్తలకు అండగా ఉంటా
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): 'అధికారాన్ని అడ్డుపెట్టుకుని మంత్రి నారాయణ బెదిరిస్తే తాను భయపడేది లేదు. నారాయణ తన విద్యాసంస్థలు, ఆస్పత్రి ఎలా ఎదిగాయో గుర్తు తెచ్చుకోవాలి. ఇతర సంస్థలను తొక్కుకుంటూ.. ఎలాంటి చర్యల ద్వారా ఎదిగాడో ప్రజలకు తెలుసు' అంటూ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన నగరంలో ఓ హోటల్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నారాయణకు చిత్తశుద్ధి ఉంటే నగరాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాజకీయ కక్షలు ఆపాలన్నారు. పొలిటికల్‌గా నారాయణ ఏమి చేసినా ఎదుర్కొంటా. నెల్లూరు సిటీలోని ప్రజలకు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. నారాయణ అధికార దర్పంతో రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఉన్న తనపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. తనకాలంలోనే కోవిడ్ సమయంలో వేలాది మందికి భోజనాలు అందించామన్నారు. రెడ్‌క్రాస్‌లో తలసేమియా రోగుల కోసం 20 పడకల క్లినిక్‌ను నిర్మిస్తున్నామన్నారు. తాను వైఎస్సార్సీపీలో ఉన్నాననే ఆక్రోశంతో రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఉండరాదంటూ దుష్ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. 20 రోజుల్లో రాజీనామా చేస్తానని చెబితే కలెక్టర్ కూడా సరే అన్నారని, ఈ కొద్దిరోజులు కూడా ఆగలేక మంత్రి ఓఎస్‌డీ తమ కమిటీ మెంబర్లకు ఫోన్ చేసి చైర్మన్ పదవి తీసేందుకు స్కోప్ ఉందా.. మొత్తం కమిటీని రద్దు చేసేందుకు ఏమి చేయాలో తెలుసంటూ బెదిరించడం దారుణమన్నారు. విమర్శలకు తావు ఇవ్వకూడదనే తాను జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నానంటూ ప్రకటించారు. మంత్రి నారాయణ ఆస్పత్రిలో కేన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిని ఏమి చేయదలచుకున్నారో చెప్పాలని కోరారు. తాను రాజీనామా చేసినప్పటికీ ఒక సభ్యుడిగా రెడ్‌క్రాస్‌లో సేవా కార్యక్రమాలు నిరంతరంగా సాగేందుకు కృషి చేస్తానన్నారు.

పెద్దాస్పత్రిలో హెచ్‌ఎంపీ వైరస్ వార్డు

- 20 పడకలతో ఏర్పాటు
- పిల్లల కోసం 5, పెద్దలకు మరో 5 వెంటిలేటర్లు



హెచ్‌ఎంపీ వైరస్ వార్డు

నెల్లూరు(అర్బన్): చైనాలో ఆందోళన సృష్టిస్తోన్న హెచ్‌ఎంపీ వైరస్ ఇండియాను తాకింది. ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ఈ వైరస్ పలువురికి సోకింది. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాలతో నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో 20 పడకలతో ప్రత్యేక హెచ్‌ఎంపీ వైరస్ వార్డును మంగళవారం ఏర్పాటు చేశారు. 10 పడకలతో సాధారణ వార్డు, మరో 10 పడకలతో క్రిటికల్ వార్డును సిద్ధం చేశారు. హెచ్‌ఎంపీ వైరస్ సోకిన రోగులకు వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వైరస్‌కు సంబంధించిన అన్ని రకాల మందులను అత్యవసరంగా కొనుగోలు చేసేందుకు ఆర్డర్లు ఇచ్చారు. రోగులు వస్తే అందించాల్సిన సేవలపై ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర ఫార్మసీ సిబ్బంది, డాక్టర్లు, నర్సులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ వైరస్ సోకిన రోగులకు ఆధునిక వైద్యం అందించేందుకు అన్ని రకాల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మస్తాన్ బాష, డా.గంగాధర్, అడ్మినిస్ట్రేషన్ హెచ్‌ఓడీ డాక్టర్ కళారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరా.. మాకొద్దు బాబోయ్!

జిల్లా కేంద్రానికి సుదూరంలో ఉన్న ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నిర్వహణ పూర్తిగా అదుపు తప్పింది. సీడీపీఓతో పాటు పలు ముఖ్యమైన పోస్టులు ఖాళీగా ఉండటంతో అక్కడ పనిచేస్తున్నవారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పైఅధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పాలనా వ్యవస్థ గాడి తప్పింది. ప్రాజెక్ట్ పరిధిలో సెంటర్లు ఎప్పుడు తెరుస్తారో, ఎప్పుడు మూసివేస్తారో తెలియని పరిస్థితి. లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా అందడం లేదు.



గాడితప్పిన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నిర్వహణ

- అక్కడికి రావాలంటే హడలిపోతున్న అధికారులు
- ఇన్‌చార్జిలను వేస్తున్నా ముఖం చాటేస్తున్న వైనం
- తాజాగా కావలి సీడీపీఓకు ఇన్‌చార్జి బాధ్యతలు
- ఆమె కూడా విధుల్లో చేరేందుకు విముఖత

ఉదయగిరి: జిల్లాలో పెద్దదైన ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో రెండేళ్ల క్రితం పాలనా సౌలభ్యం కోసం పలు మార్పులు చేశారు. ఉదయగిరి నియోజకవర్గంలో ఉన్న మర్రిపాడు మండలాన్ని ఆత్మకూరు నియోజకవర్గంలో ఉన్న అనంతసాగరం ప్రాజెక్ట్‌లో కలిపారు. దీంతో నాలుగు మండలాల పరిధిలో ఉదయగిరి ప్రాజెక్ట్ ఉంది.

ఏళ్ల తరబడి భర్తీ కాని పోస్టులు

ఉదయగిరి ప్రాజెక్ట్ విస్తీర్ణం చాలా ఎక్కువ. ఇందులో వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం, ఉదయగిరి మండలాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను 9 సెక్టార్లుగా విభజించారు. వీటి పరిధిలో 173 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 35 మినీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల పరిధిలో రోజూ సుమారు 4 వేల మంది వరకు తల్లీబిడ్డలు, గర్భిణులు, పోషకాహారం తీసుకుంటున్నారు. వీరందరికీ అన్ని సరుకులు సక్రమంగా అందాలంటే పర్యవేక్షణ చాలా అవసరం. అయితే సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లి, నర్రవాడ, దుత్తలూరు, ఉదయగిరి 1, 2, 3, సీతారామపురం, ఎస్‌ఆర్ నగర్ సెక్టార్లున్నాయి. ఇక్కడ ప్రస్తుతం ఇద్దరు సూపర్‌వైజర్లు మాత్రమే విధుల్లో ఉన్నారు. ఒక సూపర్‌వైజర్ దీర్ఘకాలికంగా సెలవులో ఉన్నారు. ఆరునెలల క్రితం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీడీపీఓ పరిస్థితులు చక్క బెట్టలేక బదిలీపై వెళ్లారు. తర్వాత ఇక్కడకు ఇన్‌చార్జిగా వచ్చేందుకు ఎవరూ సుముఖంగా లేరు. దీంతో ఆరు నెలల నుంచి పెద్ద దిక్కులేని ప్రాజెక్ట్‌గా మారింది. పక్క ప్రాజెక్ట్‌లు వింజమూరు, అనంతసాగరంల సీడీపీఓలకు అదనపు బాధ్యతలు ఇచ్చినా వారు వీధుల్లో చేరలేదు. ఇటీవల కావలి సీడీపీఓ శారదను ఇన్‌చార్జిగా వేసినా అమె ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

ఉదయగిరి అంటే చిన్న చూపా

జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన ఉదయగిరిలో విధులు నిర్వహించేందుకు అధికారులు సైతం సుముఖత చూపడం లేదు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లను వేస్తున్నా వారు వివిధ సాకులతో విధుల్లో చేరకుండా తమ పరపతి ఉపయోగించుకుని వేరే ప్రాంతానికి బదిలీ చేయించుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే తగిన శ్రద్ధ చూపకపోవడంతో ప్రాజెక్ట్ పరిస్థితి అయోమయంగా మారింది. ప్రాజెక్ట్ నిర్వహణ గాడి తప్పడంతో కేంద్రాలు కూడా సక్రమంగా పని చేయక లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు అందడం లేదు.

ఇన్‌చార్జిగా కావలి సీడీపీఓను వేశాం

ఉదయగిరి ఇన్‌చార్జి సీడీపీఓగా కావలి సీడీపీఓ శారదను నియమించాం. ఆమె విధుల్లో చేరాల్సి ఉన్నా ఇంకా రాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటాం. సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నా నాకు నియమించే అధికారం లేదు. ఉన్న వారితోనే పనులు చేయించుకుంటాం.

– సుశీల, పీడీ, ఐసీడీఎస్

బియ్యం సిండికేట్‌లో కుమ్ములాట

- అక్రమ రవాణాపై పోలీసులకు లీకులు
- పట్టించి.. కేసు పెట్టాలంటున్న ఒక వర్గం
- వదిలేయాలని మరో వర్గం పట్టు

నెల్లూరు(పొగతోట): రేషన్ బియ్యం అక్రమ రవాణా కోసం ఏర్పడిన సిండికేట్‌లో విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో బియ్యం అక్రమ రవాణాపై పోలీసులకు ప్రత్యర్థి వర్గమే సమాచారమిచ్చి పట్టిస్తోంది. ఆదివారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా నగరంలోని చౌకదుకాణం నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ సిండికేట్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న వ్యక్తే పోలీసులకు సమాచారం ఇచ్చి ఆటోను పట్టించారు. ఆటోలో 15 బస్తాలకు పైగా పీడీఎస్ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) బియ్యం ఉన్నాయి. అంతకు ముందు రెండు ఆటోల్లో బియ్యం రైస్ మిల్లుకు తరలించినట్లు సమాచారం. దీనికి సంబంధించి చౌకదుకాణం డీలర్, ఆటోపై కేసులు నమోదు చేయాలంటూ ఆ కీలక వ్యక్తే పోలీసులపై ఒత్తిడి చేశాడు. దీంతో కేసులు లేకుండా రాజీ చేసేందుకు పౌరసరఫరాల సంస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న నాయకుడు రంగ ప్రవేశం చేసినా..



నవాబుపేట పోలీస్‌స్టేషన్ వద్ద ఆటో

కీలక వ్యక్తి రాజీకి ఒప్పుకోలేదు. కేసులు కచ్చితంగా పెట్టాల్సిందేనంటూ ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. జిల్లాలో కొన్ని సంవత్సరాలుగా బియ్యం అక్రమ రవాణా చేస్తున్న కీలక వ్యక్తి ప్రతి నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులకు నెలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ముట్టచెబుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న చౌకదుకాణాల డీలర్లందరూ రేషన్ బియ్యం అతడికే ఇచ్చేలా చర్చలు జరిపి నిర్ణయం తీసుకున్నారు. అయితే కేజీ బియ్యానికి ఇస్తున్న ధర తక్కువగా ఉండటంతో కొంతమంది డీలర్లు సిండికేట్‌ను వ్యతిరేకించి డైరెక్ట్‌గా రైస్‌మిల్లులకు రేషన్ బియ్యం తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కీలక వ్యక్తే పోలీసులకు సమాచారం ఇచ్చి దాడులు చేయించి బియ్యాన్ని పట్టిస్తున్నాడని సమాచారం. బియ్యం అక్రమ రవాణా సిండికేట్‌లో కీలక వ్యక్తి ప్రతినెలా రూ.లక్షల్లో ముడుపులు ఇస్తుండడంతో తాను చెప్పిందే జరగాలంటూ పట్టు పడుతున్నాడు. కీలక వ్యక్తికి కాకుండా ఇతరులకు బియ్యం సరఫరా చేస్తే తాను సహించలేది లేదని ఎంత వరకైనా వెళ్తానంటూ తెగేసి రాజీకి ప్రయత్నిస్తున్న ప్రజా ప్రతినిధులతో వాదనకు దిగినట్లు సమాచారం.



ఆటోలో బియ్యం బస్తాలు

కేసు నమోదు చేస్తాం

ఆదివారం రాత్రి మాకు అందిన సమాచారంతో నగరంలోని చౌకదుకాణం వద్ద అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆటోను పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి విచారణ జరుగుతోంది. కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటాం. – అంకయ్య, ఇన్‌చార్జి డీఎస్‌ఓ

క్లుప్తంగా

పీఆర్‌ఎస్‌ఐ కార్యవర్గంలో నెల్లూరు వాసి


నిర్మల్ కుమార్

నెల్లూరు(బృందావనం): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్‌ఐ) అమరావతి చాప్టర్ కార్యవర్గంలో నెల్లూరీయుడు, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ టైటస్ నిర్మల్ కుమార్‌కు చోటు దక్కింది. ఆయన కార్యవర్గసభ్యుడిగా ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించడంతోపాటు, పబ్లిక్ రిలేషన్స్ ఆవశ్యతను వివరించేందుకు కళాశాలల్లో పీఆర్ క్లబ్‌లను ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం నెల్లూరులో పెన్నా బ్రిడ్జి సమీపంలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై చోటుచేసుకుంది. మృతుడి వయసు 70 నుంచి 75 ఏళ్లలోపు ఉండొచ్చు. వైట్ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బ్లూ, వైట్ కలర్ గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వ్యక్తి హత్య కేసులో నిందితుడిని నెల్లూరు సంతపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి (45) నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో పగటిపూట భిక్షాటన చేసుకుంటూ రాత్రి వేళల్లో రంగనాయకులపేట రైల్వేగేట్ సమీపంలో ఉన్న సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం పక్కనే చెట్ల కింద నిద్రించేవాడు. అతను ఓ మహిళతో రెండేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. గతనెల 29వ తేదీ తెల్లవారుజామున ఆ వ్యక్తి దారుణ హత్యకు గురి కాగా మహిళ అదృశ్యమైంది. స్థానిక వీఆర్వో సందానీబాషా ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, ఎస్సై బాలకృష్ణలు తమ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా నిందితుడిని చెన్నై తాంబరానికి చెందిన హరీష్ అలియాస్ చంటిగా గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు దారితీసిన పరిస్థితులను వెల్లడించాడు.

కక్షతోనే..

హరీష్ పదిహేనేళ్ల క్రితం ఇంటి నుంచి పారిపోయి నెల్లూరుకు వచ్చాడు. తొలుత రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసేవాడు. అనంతరం రైళ్లల్లో గుట్టుచప్పుడు కాకుండా గుట్కాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భిక్షాటన చేసే మహిళతో సహజీవనం చేశాడు. రెండేళ్ల క్రితం ఆమె విడిపోయి సదరు గుర్తుతెలియని వ్యక్తి వద్దకు వెళ్లింది. ఈ విషయమై హరీష్, ఆ వ్యక్తితో గొడవలు జరుగుతున్నాయి. హరీష్ అతడిపై కక్ష పెంచుకుని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. గతనెల 29వ తేదీన ఆదమరిచి నిద్రిస్తున్న సదరు వ్యక్తి తలపై కర్రతో విచక్షణారహితంగా దాడిచేసి హత్య చేశాడు. నిందితుడిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.

10న వ్యవసాయ కార్మిక సంఘం సదస్సు


కరపత్రాలను ప్రదర్శిస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య పిలుపునిచ్చారు. నెల్లూరు బాలాజీ నగర్‌లోని సంఘం కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు జిల్లాలో తలపెట్టిన సందర్భంగా తోటపల్లిగూడూరు మండలం నరుకూరు సెంటర్‌లో ఈనెల 10వ తేదీన భూమి – ఉపాధి, వ్యవసాయ కార్మికుల స్థితిగతులు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ కార్మికుల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. యంత్రాలు రావడంతో కూలీలకు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో కలిసి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుందని ఆరోపించారు. నిధులు తగ్గించి వ్యవసాయాన్ని చిన్నచూపు చూడటం సరికాదని హెచ్చరించారు. అనంతరం సదస్సుకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు, జిల్లా సహాయ కార్యదర్శి పచ్చా మధు, రమణమ్మ, లక్ష్మయ్య, రాజా, శౌరి, రాధయ్య, శ్రీనివాసులు, కొండయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నాడు రంగుల కథల్లో.. నేడు వేరే వృత్తుల్లో..



➡ ఈ చిత్రంలోని వ్యక్తి పేరు వెంకయ్యానాయుడు, మూలాపేట వాసి. 1991వ సంవత్సరం నుంచి కటౌట్లు, బ్యానర్లకు పెయింటింగ్ వేసే వృత్తిలో ఉన్నాడు. దాదాపు రెండు దశాబ్దాల పాటు వేల సంఖ్యలో ఆర్టులు వేశాడు. నెల్లూరులో పెద్ద హోర్డింగ్‌లు, రాజకీయ నాయకులకు సంబంధించిన బ్యానర్లకు పెయింటింగ్ వేశాడు. అప్పట్లో మంచి ఆదరణ ఉండేది. అనేక మందికి ఈ కళను నేర్పించాడు. ఫ్లెక్సీల రాకతో కొన్నేళ్లుగా పనిలేకుండా పోయింది. తప్పని పరిస్థితుల్లో మూలాపేటలో కిళ్లీ కొట్టు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే పెయింటింగ్ వేయడం ఆపలేదు. చిన్న చిన్న వర్క్‌లు వస్తే చేస్తున్నాడు.



➡ ఇతని పేరు బి.మస్తాన్. పెయింటింగ్ వేయడమంటే చాలా ఇష్టం. చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్, ఇతర హీరోల చిత్రాల విడుదల సమయంలో నెల్లూరులో థియేటర్ల ముందు ఈయన చేసిన కటౌట్లు, బ్యానర్లు పెట్టారు. సినిమా రిలీజ్‌కు వారంరోజుల ముందు నుంచే పెయింటింగ్ చేసే పనిలో ఉండేవాడు. కంప్యూటర్లలో డిజైన్ చేసుకుని ఫ్లెక్సీలు వేయించుకోవడంపై అభిమానులు ఆసక్తి చూపడం మొదలుపెట్టాక క్రమేణా ఆర్టిస్ట్‌లకు పని తగ్గింది. ఆర్డర్లు ఇవ్వకపోవడంతో ఆర్థిక పరిస్థితి మారింది. దీంతో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలో కర్రీస్ పాయింట్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. నాటి ఇష్టం అలాగే ఉండటంతో అడపాదడపా ఆర్టులు వేస్తున్నట్లు మస్తాన్ తెలిపారు.


మస్తాన్ నిర్వహిస్తున్న కర్రీస్ పాయింట్







వివిధ థియేటర్ల ఎదుట నాడు కట్టిన కటౌట్లు, బ్యానర్లు

కటౌట్లు, బ్యానర్ల తయారీలో వారిది అందెవేసిన చేయి

- ఒకప్పుడు పెయింటింగ్ ఆర్టిస్ట్‌లకు ఫుల్ డిమాండ్
- ఫ్లెక్సీల రాకతో తగ్గిన ఆదరణ
- ఇతర వృత్తుల్లోకి చాలామంది

నెల్లూరు సిటీ: నాడు సినిమాలు, వ్యాపారాలు, రాజకీయ నేతలను ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే ముఖ్యమైన ఆయుధం బ్యానర్లు, కటౌట్లు. చేతితో హీరో, రాజకీయ నాయకుడి ఫొటోలను అచ్చుగుద్దినట్లు ఆర్ట్‌గా వేసేవారు. అప్పట్లో పెయింటింగ్ ఆర్టిస్ట్‌లకు ఫుల్ డిమాండ్ ఉండేది. నెలరోజుల ముందే ఆర్డర్ ఇచ్చిన పరిస్థితులు నాడు ఉన్నాయి. ఇక కొత్త సినిమా విడుదల సమయంలో నెల్లూరు నగరంలో నర్తకి, అర్చన, మూడు హాళ్లు, లీలామహల్, గోపిక, రాధా, మాధవ్ థియేటర్ల ఎదుట పెద్ద పెద్ద కటౌట్లు కనిపించేవి. చేత్తో పెయింటింగ్ వేసిన హీరోల స్టిల్స్‌ను పోటీ పడి హాళ్ల ముందు కట్టేవారు. మా హీరోకు ఫలానా సినిమా అప్పుడు ఆ హాల్ ముందు అన్ని అడుగుల కటౌట్ పెట్టామని ఆయన అభిమానులు చెబితే.. మరో హీరో ఫ్యాన్స్ మేము కూడా చాలా పెద్ద కటౌట్ కట్టాములే అని గొప్పగా అనేవాళ్లు. ఇంకా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు వారి పుట్టినరోజులు, ఎన్నికల సందర్భంగా భారీ కటౌట్లను అభిమానులు కట్టేవారు. అదే విధంగా షాపులు, ఇతర వ్యాపార కేంద్రాల ప్రారంభోత్సవాల సమయంలో కూడా చేత్తో ఆర్ట్ వేసిన బ్యానర్లు, కటౌట్లు దర్శనమిచ్చేవి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉండేది. వాటి గురించి గొప్పగా చెప్పుకొనేవారు. అప్పట్లో పెయింటింగ్ వేసే ఆర్టిస్ట్‌లు, కటౌట్లు రూపొందించే వారు ఎప్పుడూ బిజీబిజీగా గడిపేవారు.

మారిన పరిస్థితులు

పేద కుటుంబాల నుంచి వచ్చిన అనేకమంది వేలసంఖ్యలో కటౌట్లు, బ్యానర్లు చేశారు. నెల్లూరు నగరంలో 20 సంవత్సరాల క్రితం ఆర్టిస్ట్‌లు దాదాపు 300 మంది ఉండేవారు. నేడు సంఖ్య 20 లోపే ఉండొచ్చు. నాడు జిల్లాలో మొత్తంగా ఈ వృత్తిపై రెండువేలమంది ఆధారడి జీవనం సాగించారు. దశాబ్దాలపాటు పెయింటింగ్ ఆర్టిస్ట్‌లకు మంచి డిమాండ్ కొనసాగింది. ఫ్లెక్సీల రాకతో పరిస్థితులు మారాయి. ఆర్టిస్ట్‌లు తమకు ఇష్టమైన పనిని వదిలి ఇతర రంగాల్లో స్థిరపడ్డారు. ఎంతో ఇష్టంగా నేర్చుకున్న కళను వదిలేయాల్సి వచ్చిందని చాలామంది బాధపడుతున్నారు. కొందరు ఇళ్లకు పెయింట్ వేసే పనిలో ఉన్నారు. పలువురు ఆటో డ్రైవర్లుగా మారారు. అడపాదడపా చిన్న చిన్న ఆర్టులు వేస్తున్న వారున్నారు.





మస్తాన్ గీసిన చిత్రాలు

షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు చేదు అనుభవం

- దురుసుగా ప్రవర్తించిన టీడీపీ నాయకుడు


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న కార్మికులు

కోవూరు: సమస్యను చెప్పుకొందామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వద్దకు వెళ్లిన షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, నాయకులకు చేదు అనుభవం ఎదురైంది. మండలంలోని పోతిరెడ్డిపాళెం గ్రామంలో మంగళవారం సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసేందుకు ఎమ్మెల్యే వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సమీపంలోని కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు ఆమె వద్దకు వెళ్లి మాట్లాడారు. 'మేమేం పాపం చేశాం?, గత టీడీపీ ప్రభుత్వంలో ఈ ఫ్యాక్టరీని మూసివేశారు. అప్పటి నుంచి మా జీవితాలు దారుణంగా తయారయ్యాయి. కొందరు స్వార్థ రాజకీయాల కోసమే ఫ్యాక్టరీని మూసివేసి కడుపులు కొట్టారు. మా గోడును ఆలకించి న్యాయం చేయాలి' అని మొర పెట్టుకున్నారు. దీనిని జీర్ణించుకోలేకపోయిన ఆ గ్రామ టీడీపీ నాయకుడు తిరుమూరు అశోక్‌రెడ్డి కార్మికులతో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో వారు మా సమస్యల్ని ఎమ్మెల్యేకు చెప్పుకోనివ్వరా.. అంటూ అసహనం వ్యక్తం చేశారు. కార్మికులు ఎంత చెబుతున్నా స్థానిక నాయకులు వారిని అక్కడి నుంచి పంపించి వేశారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి


క్యాలెండర్లు, డైరీలు అందజేస్తున్న నేతలు

సోమశిల: అనంతసాగరం మండలంలోని టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మెట్టుకూరు సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వైఎస్సార్ టీఎఫ్ క్యాలెండర్లు, డైరీలు, కరపత్రాలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యాల డానియేల్, శ్రీలత, ఆదిశేషయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఆడి.. విజయాలు సాధించి..





పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వారిలో కొందరు అంతర్జాతీయ స్థాయిలో రాణించారు.. మరికొందరు ఇప్పుడిప్పుడే విజయాల బాటలో ఉన్నారు. నేడు ఒకచోట చేరి తమ క్రీడా ప్రయాణంలో అనుభవాలను పంచుకుంటున్నారు. జాతీయ క్యారమ్ ఫెడరేషన్, రాష్ట్ర క్యారమ్ ఫెడరేషన్ సంయుక్తంగా నెల్లూరులో నిర్వహిస్తున్న 29వ ఆలిండియా ఫెడరేషన్ క్యారమ్ టోర్నమెంట్ 2024 – 25 చివరి అంకానికి చేరుకుంది. నెల్లూరు క్లబ్‌లో పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు, దానితో అనుబంధం ఉన్న వారు విచ్చేశారు. పలువురితో సాక్షి మాట్లాడగా తాము సాధించిన విజయాలు, క్యారమ్స్ క్రీడ అభివృద్ధికి చేస్తున్న కృషిని వెల్లడించారు.

క్రీడపై ప్రేమతో..



మాది హైదరాబాద్. క్యారమ్స్‌పై మక్కువతో 16 సంవత్సరాలుగా రెఫరీగా సేవలందిస్తున్నా. చిన్నప్పటి నుంచి ఆడుతున్నాను. అకౌంటెంట్ జనరల్ డిపార్ట్‌మెంట్ నుంచి 16 సంవత్సరాలు క్యారమ్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహించాను. సివిల్ సర్వీసెస్ పోటీల్లో పలుమార్లు విన్నర్‌గా నిలిచాను. క్యారమ్స్‌పై ప్రేమతో ప్రతి పోటీల్లో రెఫరీగా స్వచ్ఛందంగా సేవలందిస్తున్నాను.

– వి.రత్నబాబు, ఆలిండియా క్వాలిఫైడ్ రెఫరీ

చిన్నతనం నుంచి ఆసక్తి



మాది వైజాగ్. 4వ తరగతి నుంచి క్యారమ్స్ ఆడుతున్నా. మధ్యలో ఐదేళ్లు చదువు కోసం క్రీడపై దృష్టి సారించలేదు. మళ్లీ అదే క్రీడపై ప్రత్యేక శ్రద్ధ పెట్టా. 29 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో 20 పతకాలు సాధించా. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో దంత వైద్యురాలిగా పనిచేస్తున్నా. నా భర్త కన్నబాబు టెన్నిస్ కోచ్. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో అంతర్జాతీయ పోటీల్లో రాణించాలనేది నా లక్ష్యం.

– ఎంఎస్‌కే హారిక, జాతీయ స్థాయి క్రీడాకారిణి, వైజాగ్

కుటుంబం మొత్తం



మాది గుంటూరు. రెండు తరాలుగా మా కుటుంబం క్రీడా రంగంలోనే ఉంది. మా అమ్మ అనురాధ జాతీయ స్థాయి క్యారమ్స్ క్రీడాకారిణి. నేను వివిధ స్థాయిల్లో క్యారమ్స్ పోటీల్లో పాల్గొంటున్నాను. నా కూతురు హుస్నా సమీరా ఇప్పటికే రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు ఈ క్రీడలో నెలకొల్పింది. 2018 సంవత్సరంలో ఆలిండియా గ్రాండ్‌స్లామ్ పోటీలు గుంటూరులో నిర్వహించాం. ఇప్పటి వరకు 25 జాతీయ స్థాయి పోటీలకు టెక్నికల్ సపోర్ట్‌ను అందించా.

– డాక్టర్ ఎస్‌కే సాజిదా, టెక్నికల్ బోర్డు అసిస్టెంట్ చీఫ్

రెండుసార్లు వరల్డ్ చాంపియన్



మాది హైదరాబాద్. నాన్న క్రీడాకారుడు కావడంతో చిన్నప్పటి నుంచి వాటిపై ఆసక్తి ఉంది. బాల్యం నుంచి క్యారమ్స్ ఆడుతూ 2004, 2016లో వరల్డ్ చాంపియన్ టైటిల్ సాధించాను. స్పోర్ట్స్ కోటాలో 2002లో ఎల్‌ఐసీలో ఉద్యోగం వచ్చింది. 24కు పైగా జాతీయ స్థాయి, రెండు అంతర్జాతీయ టైటిల్స్‌తో ఎల్ఐసీ గ్రేడ్‌గా నిలవడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం ఏఓగా పనిచేస్తున్నాను. భర్త కిశోర్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. నెల్లూరులో క్రీడల నిర్వహణ అద్భుతంగా ఉంది.

– అపూర్వ, హైదరాబాద్

నేడు ఫైనల్ పోరు

మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్, ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో మహిళల డబుల్స్, సింగిల్స్, పురుషుల డబుల్స్, సింగిల్స్ పోటీలు రసవత్తరంగా సాగాయి. 20 రాష్ట్రాలు, 10 ప్రముఖ సంస్థలకు చెందిన 350 మంది క్రీడాకారులు మూడురోజులపాటు తమ ప్రతిభను ప్రదర్శించారు. సెమీఫైనల్స్‌కు చేరుకున్నారు.

మూడోరోజు ఫలితాలు.. మహిళా విభాగంలో..

తమిళనాడుకు చెందిన శోభిక – ప్రీతి ప్రిన్సెస్ జట్టు పీఎస్‌పీబీకి చెందిన రష్మీకుమారి – ఇళవళగిపై విజయం సాధించారు. పీఎస్‌పీబీకి చెందిన ఎం.కసీమా – మిత్ర జట్టు సీసీసీఎస్‌బీకి చెందిన నాగజ్యోతి – నీలంపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరారు.

పురుషుల సెమీ ఫైనల్స్

ఆర్‌బీఐకు చెందిన జహీర్‌పాషా – ప్రశాంత్ మోరే జట్టు జైన్ ఇరిగేషన్‌కు చెందిన రహీమ్ కరీంఖాన్ – అభిజిత్ త్రిపాంకర్‌పై విజయం సాధించారు. కర్ణాటకకు చెందిన వికాస్ హరీష్ దరియా – పంకజ్ అశోక్‌పవార్ జట్టు జైన్ ఇరిగేషన్‌కు చెందిన సందీప్ దైవ్ – అజీజ్ అహ్మద్‌పై గెలిచారు.

సింగిల్స్ విభాగంలో..

సింగిల్స్ విభాగంలో ఎల్‌ఐసీకి చెందిన ఢిల్లీబాబు, పీఎస్‌పీబీకి చెందిన టాప్ సీడెడ్ ఎండీ ముఫ్రాన్‌పై, పీబీఎస్‌పీబీకి చెందిన శ్రీనివాస్ బీఏఎస్‌సీబీకి చెందిన ధర్మేంద్ర కుమార్‌పై, మహిళా విభాగంలో పీఎస్‌పీబీకి చెందిన రష్మీకుమారి రాజస్థాన్‌కు చెందిన సీమాచౌహాన్‌పై, గుజరాత్‌కు చెందిన వానిష్‌శ్రుతి ఏపీకి చెందిన సీహెచ్ సుధాపై, ఏఏఐకు చెందిన నిధి గుప్తా తెలంగాణకు చెందిన నాగజ్యోతిపై, తమిళనాడుకు చెందిన ఎల్.కీర్తన డీఏఎస్‌సీబీకి చెందిన అంజలి ప్రజాపతిపై విజయం సాధించారు. పోటీలను అంతర్జాతీయ క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసెఫ్ మేయర్, ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఎంపీ రఫీబుల్ హుస్సేన్, ఇంకా నారాయణ, డాక్టర్ నీరజ్ కుమార్ సంపత్, భారతీ నారాయణ్, ఎస్.మధుసూదన్‌రాజ్, రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జలీల్, ఫెడరేషన్ కప్ కో– చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరు క్లబ్ కార్యదర్శి, టోర్నీ నిర్వాహక కార్యదర్శి పొన్నపోలు సుధాకర్‌రెడ్డి, జిల్లా క్యారమ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, కార్యదర్శి శ్రీధర్, క్లబ్ కోశాధికారి విశ్వనాథ్‌లు పర్యవేక్షించారు.



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.29
సన్నవి	: రూ.23
పండ్లు	: రూ.12



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 117
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 212
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 234
లేయర్ చికెన్	: 145



సాక్షి ఫ్యామిలీ
నెల్లూరు
బుధవారం ॥ 8-1-2025


మొక్కల నాటక ముందు...


మొక్కల నాటిన తర్వాత...




● అదర్ సైడ్


● శ్వేత

ఆమే వనమై...

ఎస్.పి గారి డ్యూటీ నేరాలను అరికట్టడం. భూమి మీద చెట్టు చేమా లేకుండా పోయేలా మనిషి వహిస్తున్న నిర్లక్ష్యాన్ని మించిన నేరం ఉంటుందా? దానినీ అరి కట్టాలి కదా. కామారెడ్డి జిల్లా ఎస్పీగా శ్వేత పనిచేస్తున్న కాలంలో ఒక హరిత వనాన్ని పెంచడం తన కర్తవ్యం అనుకున్నారు. ఆరు ఎకరాల్లో ఎన్నో మొక్కలు నాటించారు. ఇప్పుడది అడవిని తలపిస్తోంది. హరిత రక్షక వనంగా నామకరణం చేసుకుంది.

హరితహారం స్ఫూర్తితో తన వంతు బాధ్యతగా మొక్కలను నాటడమే కాదు వాటిని సంరక్షించా లనే లక్ష్యంతో రంగంలోకి దిగారు అప్పటి కామా రెడ్డి ఎస్పీ శ్వేత. కామారెడ్డిలో ఆరు ఎకరాల స్థలంలో 80 రకాలైనవి ఎన్నో మొక్కలు నాటిం చారు. మొక్కలు నాటడమే కాదు వాటిని కాపాడేం దుకు ఆమెతో పాటు పోలీసు సిబ్బంది నిరంతరం శ్రమించారు. ఫలితంగా ఇప్పుడు అక్కడ అడవిని తలపించే విధంగా చెట్లు పెరిగి పెద్దవయ్యాయి. మూడేళ్ల కాలంలో ప్రతీ రోజూ ఎస్పీ శ్వేత అక్కడికి వెళ్లేవారు. జరుగుతున్న పనులను పర్యవేక్షించే వారు. ప్రతీ రోజూ వాకింగ్, రన్నింగ్ అక్కడే చేసే వారు. ఈ వనానికి 'హరిత రక్షక వనం' అని నామకరణం చేశారు.

ఎనభై రకాల మొక్కలు...

స్థానికంగా పెరిగే అటవీ వృక్ష జాతులకు సంబంధించి దాదాపు 80 రకాల మొక్కలు నాటా రు శ్వేత. రామ సీతాఫలం, బాదమ్, శ్రీగంధం, టేకు, ఖర్జూరం, వేప, పనస, నేరేడు, చింత, దానిమ్మ, జామ, ఈత, మేడి, మునగ, నిమ్మ, ఉసిరి, వెలగ, కుంకుడు, కదంబం, నల్లజీడి, రాచఉసిరి, జిట్రేగి... మొదలైన రకాలకు సంబంధించి ఎన్నో మొక్కలు నాటారు.

ప్రతీ మొక్కకు నీరందించడానికి డ్రిప్ ఏర్పాటు చేశారు. అక్కడ రెండు బోర్లు తవ్వించి వాటి ద్వారా నీటిని అందిస్తున్నారు. 'హరిత రక్షక వనం'లో రెండు నీటి గుంతలు తవ్వించా రు. అందులో నీరు నిల్వ ఉండేలా వర్షపు నీరు ఆ గుంతలో నిండేలా ఏర్పాటు చేశారు. పై భాగాన ఉన్న గుంతలో పది అడుగుల మేర నీటి నిల్వ ఉంది. అందులో చేప పిల్ల లను పెంచుతున్నా రు. నీటిని నిల్వ చేయడం మూలంగా బోరుబావుల్లో భూగర్భ జల మట్టానికి ఇబ్బంది లేకుండాపోయింది.



ఆ శ్రమ వృథా పోలేదు...

'హరిత రక్షక వనం'లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీ సులు శ్రమించారు. ఆ మొక్కలను తమ ఇంటి పెరట్లో నాటిన మొక్కలలాగే చూసుకున్నారు. మొక్కల చుట్టు పెరిగే గడ్డిని తొలగించడం, నీరు మొక్కకు చేరుతుందా లేదా చూసుకోవడం, పనికి రాని చెత్తను తొలగించడంలాంటి పనులెన్నో చేసే వారు. పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధు లు, ఇతర అధికారులు జిల్లా పోలీసు కార్యాలయా నికి వస్తే వారితో మొక్కలు నాటించేవారు. ఆ చెట్లకు వారి పేర్లతో నేమ్‌ప్లేట్లు ఏర్పాటు చేశారు.

'చెట్టు అంటే....భూమాత రాసిన కవిత్వం' అనేది భావుక తతో కూడిన మాటే కాదు బాధ్య తను గుర్తుకు తెచ్చే మాట.

వృత్తిబాధ్యత, సామాజిక బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ పచ్చటి వనాన్ని సృష్టించడం కష్టమేమీ కాదు అని నిరూపిస్తున్నారు శ్వేత లాంటి అధికారులు.

- సేపూరి వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి

మానసిక స్థైర్యాన్ని ఇచ్చారు

శాంతిభద్రతలకు సంబంధించిన వ్యవహా రాల్లో బిజీగా ఉంటూనే రకరకాల సామాజిక అంశాలపై స్పందించేవారు శ్వేత. కరోనా కాలంలో పోలీసు సిబ్బందిలో మానసిక స్థైర్యాన్ని కలిగించి ఎంతో మందికి అండగా నిలిచారు. నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాల కోసం రాత పరీక్ష లకు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వ హించారు. శారీరక ధారుఢ్య పరీక్ష లకు శిక్షణ ఇప్పించారు.

అమ్మలాంటి చెట్టు

కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తరువాత కలెక్ట రేట్, పోలీస్ కార్యాలయాల కోసం ఎంపిక చేసిన స్థలం దగ్గరికి వెళ్ళినప్పుడు ఈ స్థలం కనిపించి నాకు వనం పెంచాలన్న ఆలో చన వచ్చింది. పెద్ద పెద్ద భవనాలు నిర్మించి నపుడు అక్కడ వాతావరణం మారిపోతుం ది. చల్లబడాలంటే సమాంతరంగా చెట్లు పెంచాలి. అందుకే 2017 దసరా రోజు నేను, అప్పటి కలెక్టర్ సత్యనారాయణ గారు ఇక్కడ మొక్కలు నాటాం. కామారెడ్డికి పోలీస్ ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా వాళ్ళతో అక్కడ మొక్కలు నాటించాను. నాటడంతో పాటు మా పోలీస్ అధికారు లు, సిబ్బంది అందరూ వాటి సంరక్షణకు నిరంతరం శ్రమించారు. అక్కడి ఉసిరి చెట్టు దగ్గర మా అమ్మ ప్రతీ కార్తీక పౌర్ణమి రోజున పూజలు చేసి అందరికీ భోజనాలు పెట్టేవాళ్ళు. నేను బదిలీ అయినా ఒక అమ్మలా ఆ చెట్టు గుర్తుకొస్తూ ఉంటుంది.

- ఎన్. శ్వేత, ఐపీఎస్

● నృత్యోద్యమం



లండన్‌లో శివతాండవం

నాట్యం అనేది ఆహ్లాదానికే కాదు మానసిక వికాసానికి కూడా అనుకుంటే... నాట్యం అంటే సంతోషమే కాదు మానసిక స్థైర్యం కూడా అనుకుంటే... నాట్యం అనేది ఆనందతరంగమే కాదు పర్యావరణహిత చైతన్యం అంటే గుర్తుకు వచ్చే పేరు.... సోహిని రాయ్ చౌదరి....

సోహిని రాయ్ చౌదరి తండ్రి సుబ్రతో రాయ్ సితార్ విద్వాంసుడు. తల్లి ఉమా రాయ్ చౌదరి శిల్పి. కోల్‌కత్తాలోని వారి ఇంటిలో ఎప్పుడూ కళాత్మక వాతావ రణం ఉండేది. నాలుగు సంవత్సరాల వయసులోనే నృత్యకారిణిగా కాళ్లకు గజ్జె కట్టింది సోహిని రాయ్ చౌదరి. భరతనాట్యం నుంచి మోహినియాట్టం వరకు ఎన్నో నృత్యా లలో ప్రావీణ్యం సాధించింది.

'మన వైదిక సిద్ధాంతాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్నీ మానవతావాదం, మంచి గురించి చాటి చెప్పాయి. కోవిడ్, ఆర్థిక మాంద్యం, యుద్ధంలాంటి అనిశ్చిత కాలాల్లో అవి మనకు ధైర్యాన్ని ఇస్తాయి. ఇతరులకు సహాయపడేలా ప్రేరణ ఇస్తాయి. జీవితానికి సానుకూల దృక్పథాన్ని ఇచ్చే శక్తి మన పవిత్ర తత్వాలలో ఉంది' అంటుంది సోహిని.

వాతావరణ మార్పులపై ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఎన్నో సదస్సులలో సోహిని రాయ్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'వేదమంత్రాలతో కూడిన నా నృత్యప్రద ర్శన ప్రకృతి గురించి, మన జీవితాల్లో దాని ప్రాముఖ్యత గురించి తెలియజేసేలా ఉంటుంది. పశుపతిగా శివుడు, అడవులు, జంతువులు, పర్యావర ణాన్ని పరిరక్షించేవాడు. ప్రకృతిని మనుషులు ఎలా దుర్వినియోగం చేస్తున్నారో, విధ్వంసం సృష్టి స్తున్నారో చెప్పడానికి, ప్రకృతితో సన్నిహిత సంబంధాల కోసం శివతాండవం చేస్తున్నాను' అంటున్న సోహిని రాయ్ 'గ్లోబల్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ కూడా అందుకుంది.

ప్రపంచవ్యాప్తంగా భారతీయ కళలు, సంస్కృతికి సోహిని రాయ్ చౌదరి అంబాసిడర్‌గా మారింది. యూకేలోని ఇండి యన్ హైకమిషన్‌కు చెందిన నెహ్రూ సెంటర్‌లో సోహిని చేసిన శివతాండవం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శివతాండవంతో పాటు శివుడి గురించి రుషి దాస్ గుప్తా చెప్పిన విలువైన మాట లను వినిపించింది.

మార్కండేయ పురాణం, శివపురాణాలలో నుంచి ఒక కథను ఎంపిక చేసుకొని దాన్ని నృత్యరూపకంగా మలుచు కుంది. లండన్ తరువాత అమెరికా, రష్యా, జర్మనీ, స్పెయిన్... మొదలైన దేశాల్లోనూ ప్రదర్శనలు ఇవ్వబోతోంది.


'డ్యాన్సింగ్ విత్ ది గాడ్స్' పేరుతో తొలి పుస్తకం రాసిన సోహిని రాయ్‌కు రచనలు చేయడం అంటే కూడా ఎంతో ఇష్టం. ఆమె రచనల్లో మహిళా సాధికారత నుంచి రంగస్థలం వరకు, నృత్యోద్యమం నుంచి దేవదాసీల దుస్థితి వరకు ఎన్నో అంశాలు ఉంటాయి.

శక్తివాదాన్ని ప్రధానంగా చేసుకొని ఎన్నో రచనలు చేసింది. 'ఇండియన్ స్టేజ్ స్టోరీస్: కనెక్టింగ్ సివిలైజేషన్స్' పేరుతో సోహినిరాయ్ రాసిన పుస్తకం భారతీయ రంగస్థలం ఆత్మను పట్టిస్తుంది. ఈ పుస్తకం ద్వారా మన నాగరికతలోని గొప్ప సాంస్కృతిక, సంప్రదాయల గురించి తెలియజేసే ప్రయత్నం చేసింది. యూరప్‌లోని పద్దెనిమిది యూనివర్శిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసింది.

'సూఫీ తత్వం, రూమీ కవిత్వం, ఠాగూరు మానవతా వాదంలో నాకు మహిళాసాధికారత కనిపిస్తుంది' అంటున్న సోహినిరాయ్ చౌదరి తన నృత్య కళను సామాజిక ప్రయోజనం కోసం ఉపయో గిస్తోంది.


● సోహిని రాయ్ చౌదరి

● ముగ్గు ముచ్చట




నల్లబెల్లి మనోజ్ఞ
మంచిర్యాల
17 చుక్కలు, 3 వరుసలు
3 వచ్చే వరకు, సరి చుక్కలు




సి. పుష్కల,
శ్రీనగర్ కాలనీ, కడప
17 చుక్కలు, 7 వచ్చేవరకు
మధ్య చుక్క



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

● గర్భసంచి

తొలగించడమే పరిష్కారమా?!

'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సెన్సెస్, జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు తాజాగా జర్నల్ ఆఫ్ మెడికల్ ఎవిడెన్స్ ద్వారా ఓ విషయాన్ని వెల్లడించారు. దేశంలోని 25 నుంచి 49 ఏళ్ల మధ్య వ్యవసాయ కూలీ లుగా ఉన్న గ్రామీణ మహిళల్లో 32 శాతం గర్భసంచి తొలగింపు (హిస్టరెక్టమీ) శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారని, ఈ శస్త్ర చికిత్సలు ప్రభుత్వ బీమా పథకాల ద్వారానే జరుగుతున్నాయని వెల్లడి అయింది. గర్భసంచి తొలగింపు శస్త్ర చికిత్స లవైపు గ్రామీణ మహిళలు ఎందుకు మొగ్గు చూపుతున్నారు?! ఏ అంశాలు వీరిని ప్రేరేపి స్తున్నాయి?! గర్భసంచి తొలగిస్తే వచ్చే నష్ట మేమిటి?! అవగాహన అవసరం...

దేశంలో బిహార్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. రాష్ట్రాల్లోని గ్రామాల్లో హిస్టరె క్టమీ రేటు పెరగడం ఆందోళన కలిగిస్తోం దని పరిశోధకులు చెబుతున్నారు. అవగా హన లోపమే ఇందుకు ప్రధాన కారణం అంటున్నారు స్త్రీ వైద్య నిపుణులు. వారు చెబుతున్న విషయాలేంటంటే..

ఖర్చుకు భయపడి...

● వ్యవసాయ కూలీలుగా ఉన్న మహిళల్లో వ్యక్తిగత శుభ్రత తక్కువ. దీనివల్ల గర్భసంచికి ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి.

● పోషకాహార లోపం వల్ల రక్తహీనత, అధిక రక్తస్రావం, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్లు, రుతు సమయంలో వచ్చే నొప్పులను ఇంటిలో పనుల కారణంగా భరిస్తున్నారు. అయితే గర్భసంచి వాపు, సిస్టులు అనగానే క్యాన్సర్ అని భయపడుతున్నారు.

● సమస్య తీవ్రం అయినప్పుడు హాస్పి టల్‌కు రావడం, త్వరగా నయం కాకపోవ డంతో పదే పదే డాక్టర్ దగ్గరకు వెళ్లవలసి వస్తుందని, దీనివల్ల ఇంటి పనులు, కూలి పనులకు ఇబ్బందులు వస్తాయని, తమ వెంట వచ్చేవారి పని కూడా పోతుందని, టెస్టులకు, మందులకు అదనపు ఖర్చు అని.. 'గర్భసంచి తొలగించుకుంటే' ఈ చికాకు లన్నీ పోతాయనే ఆలోచనకు వస్తున్నారు.

● శస్త్ర చికిత్సకు ప్రభుత్వం అందించే ఉచిత పథకాల కోసం వెతుకుతున్నారు.

● గర్భసంచి సమస్యలను వాయిదా వేసుకుంటూ కూలి పనులు ఎక్కువ ఉండని వేసవి కాలాన్ని ఆపరేషన్‌కు కేటాయించు కుంటున్నారు.

● త్వరగా పెళ్ళిళ్లు అవడం, పిల్లలు పుట్టడం, త్వరగా గర్భసంచి తొలగించుకో వడం అనేది గ్రామాల్లో కూలి పనులకు వెళ్లే వారిలో తరచూ కనిపిస్తోంది.

అత్యవసర అవగాహన

● శుభ్రతకు సంబంధించిన అవగాహన అత్యవసరం.

● అధిక రక్తస్రావం సమస్యలకు కూడా పరిష్కారాలు ఉన్నాయి. హార్మోన్లకు, బలానికి వాడే మందులను అందజేయాలి.

● తప్పనిసరై గర్భసంచి తొలగించు కున్నా సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే రకరకాల ఇతర సమస్యలు తలెత్తుతాయి. దీంతో మళ్లీ హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుం ది. మధుమేహం, బలహీనత, ఎముకల సమస్యలు... వీటన్నింటి పైనా అవగాహన కల్పించాలి.

ఆర్థికంగానే కాదు ఆరోగ్యంగా ఉండ టమూ దేశ భవిష్యత్తుకు కొలమానమే. వ్యవసాయ కార్మికులుగా ఉన్న మహిళలు తరచూ పురుగు మందులకు గురి కావడం వల్ల కూడా అధిక రుతుస్రావాలు, ఫైబ్రా యిడ్లు, గర్భాశయ లోపాలు, జననేంద్రియ సమస్యలకు కూడా గురవుతున్నారని నివేదికలు తెలియజేస్తున్నాయి.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఏడాదికోసారి పాప్‌స్మియర్ టెస్ట్

గర్భసంచి తొలగించడం వల్ల అండాలు విడుదల కాక హార్మోన్ల పని తీరు దెబ్బతింటుంది. దీనివల్ల ఎముక లపై ప్రభావం పడి, త్వరగా కీళ్ల సమస్యలు వస్తాయి. చాలా మందిలో రకరకాల ఇన్ఫెక్షన్ల వల్ల గర్భసంచి వాపు వస్తుంది. ఫైబ్రాయిడ్స్, సిస్టులు వస్తుం టాయి. అయితే అవగాహన లేక క్యాన్సర్ వస్తుందేమో అనే భయంతో గర్భసంచి తీసేయమని కోరుతున్నారు. పాప్‌స్మియర్ స్క్రీనింగ్‌తో గర్భసంచి సమస్య ఏంటో ముందే తెలు సుకోవచ్చు. దానికి తగిన మందులు వాడితే సరిపో తుంది. 40 ఏళ్ల లోపు మహిళలకు గర్భసంచి తొలగించకపోవడమే మంచిది. హెల్త్ అవేర్‌నెస్ క్యాంప్స్, ఏడాదికోసారి పాప్ స్మియర్ టెస్టులు, కుటుంబం మొత్తానికి స్త్రీ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిం చడం ద్వారా ఈ సమస్యను పరిష్కరిం చవచ్చు.



- డాక్టర్ భానుప్రియ, గైనకాలజిస్ట్, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్, నిజామాబాద్



అడ్డంకిగా భావిస్తున్నారు

గ్రామీణ మహిళలు ఓవర్ బ్లీడింగ్, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్స్ వంటి సమస్య లతో మా దగ్గరకు వస్తుంటారు. ఇలాం టప్పుడు టెస్టులు చేయించుకోవడం మందులు వాడటం, పదే పదే వైద్యు లను సంప్రదించడం వారికి కష్టంగా మారుతుంది. అందుకు గర్భసంచి తొలగించుకో వడం మేలేమో అనే ఆలోచన చేస్తున్నారు. సాధారణంగా 50 ఏళ్లలో మెనోపాజ్ లక్ష ణాలు కనిపి స్తాయి. సర్జికల్‌గా వచ్చే మెనోపాజ్ వల్ల చెమటలు పట్టడం, అలసిపోవడం, చిరాకు, హాట్ ఫ్లషెస్.. అన్నీ ముప్పై ల్లోనే కనిపిస్తాయి.



- డాక్టర్ మనోరమ, మధిర, ఖమ్మం జిల్లా



కురుల చివరలు చిట్లుతుంటే...

చలికాలం చర్మ ఆరోగ్యాన్నే కాదు శిరోజాల సహజ త్వాన్ని కాపాడుకోవాలి. లేదంటే వెంట్రుకలు పొడి బారడం, చిట్లడం, చుండ్రు సమస్య తలెత్తడం వంటివి చూస్తుంటాం. ఈ సమస్యకు పరిష్కారంగా...

● బ్యూటిప్స్

అలెవెరాతో కండిషనింగ్

షాంపులు, కాలుష్యం, గాలిలో తేమ తగ్గడం.. వంటి వాటి వల్ల ఈ కాలంలో వెంట్రుకలు త్వరగా పొడిబారడం, చిట్లడం వంటివి సహజంగా జరుగుతుంటాయి. వీటి వల్ల జుట్టు నిస్తేజంగా కనిపి స్తుంది. రసాయనాల గాఢత తక్కువగా ఉండే షాంపూతో తల స్నానం చేసిన తర్వాత అలోవెరా జెల్‌ను జుట్టుకు పట్టించాలి. 15-20 నిమిషాల తర్వాత నీటితో కడిగేయాలి. అలోవెరా రసం జుట్టుకు కావలసినంత కండిషన్ లభించేలా చేస్తుంది.

ఉసిరితో మృదుత్వం

ఉసిరి, మందారపువ్వులు మరిగించిన కొబ్బరినూనెతో మాడుకు, వెంట్రుక లకు రాసి, మర్దనా చేయాలి. మరుసటి రోజు ఉదయం తలస్నానం చేయాలి. ఈ విధంగా చేస్తే వెంట్రుకలు చిట్లడం సమస్య తగ్గుతుంది. కురుల మృదుత్వం పెరుగుతుంది.

లీగల్

నిరాశ పడద్దు... మీకు న్యాయం జరుగుతుంది

మా ఇంటి పక్కన వారు మా ఇంటికి ఆనుకొని ఎలాంటి అనుమతి లేకుండా వారి పెంట్‌హౌస్ కట్టుకుంటున్నారు. ఆ పెంట్‌హౌస్ కట్టడం వలన మా ఇంటిలోకి వెలుతురు రావడం ఆగి పోతుంది. వారు పెంట్ హౌస్ కట్టుకోవడానికి అనుమతి కూడా లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే మా ఇల్లు మా ఇష్టం, నీ కెందుకు సమాధానం చెప్పాలి అని గొడవ పడుతున్నారు. కాలనీ అసోసియేషన్ వారు మాట్లాడినా లాభం లేకుండా పోయింది. ఏం చేయాలో సలహా ఇవ్వ గలరు.

- పవన్ కుమార్, హైదరాబాద్

ముందుగా మీరు వ్యక్తిగతమైన వాగ్వాదా నికి చోటు ఇవ్వకండి. అది సరైనది కాదు, దాని వల్ల వివాదం పెరుగుతుందే తప్ప తగ్గదు! ఎవరి ఇంటిలో వారు నిర్మాణాలు చేసుకోవచ్చు కానీ అది పక్కవారికి ఇబ్బంది కలగకుండా, పక్కవారి హక్కులకు భంగం కలగకుండా ఉండాలి. అంతేకాక, చట్టరీత్యా నిబంధనలకు లోబడి ఉండాలి. సరైన అనుమతి లేకుండా నిర్మించే ఎలాంటి కట్టడమైనా అక్రమ కట్టడం గానే పరిగణించబడుతుంది. చట్టరీత్యా చర్యలు తీసుకుంటే అలాంటి అక్రమ కట్టడాలను తొల గించాల్సి వస్తుంది. మీరు వెంటనే మునిసిపల్ అధికారులకు ఒక ఫిర్యాదు చేయండి. అందులో మీకు కలిగే నష్టం ఏమిటి, మీ పక్కింటి వారు చేస్తున్న అక్రమ నిర్మాణం ఏమి టి, ఎందుకని ఆ నిర్మాణాన్ని అక్రమ నిర్మాణం అని మీరు అంటున్నారు వంటి విషయాలను ప్రస్తావిస్తూ రాయండి. నేరుగా వెళ్తే అధికారులు మీ ఫిర్యాదు తీసుకోలేము అనటం సహజంగా చూస్తుంటాం. అందుకే రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మీ ఫిర్యాదును పంపించవచ్చు. సరైన వ్యవ ధిలో అధికారులు చర్యలు తీసుకోకపోతే, మీరు హైకోర్టును కూడా ఆశ్రయించి మీ ఫిర్యాదు పై చర్యలు తీసుకోవాలి అని హైకోర్టు ఆర్డరు పొందవచ్చు. అలా చేయడం ద్వారా అధికా రులు సదరు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి, నిజానిజాలు తేల్చిన తర్వాత తొలగించే చర్య లను చేపడతారు. అయితే, కోర్టు కేసులలో కొంత ఆలస్యం జరగవచ్చు. దానికి నిరాశ పడవలసిన అవసరం లేదు. చట్టరీత్యా మీకు న్యాయం జరుగు తుంది.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.